# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-10-2023** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో గడచిన తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో భారతదేశం సమ్మిళిత అభివృద్ధి చెందిందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖీ పేర్కొన్నారు.

2. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు.

3. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

4. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్లపై ఈరోజు తీర్పులు వెలువడే అవకాశముంది.

5. సూర్యుడిపై పరిశోధనల నిమిత్తం ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో వెల్లడించింది.

6. ప్రపంచ తపాలా దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో గడచిన తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో భారతదేశం సమ్మిళిత అభివృద్ధి చెందిందని కేంద్ర విదేశాంగ, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖీ పేర్కొన్నారు. డిబిటి పద్ధతిలో జనధన్ ఖాతాలను ఆధార్... మొబైల్ ఫోన్‌తో అనుసంధానం చేయడంతో, కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. విజయవాడలో ఆమె నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ... గత తొమ్మిదిన్నర సంవత్సరాల్లో 39 లక్షల కోట్ల రూపాయలను 52 కోట్లకు పైగా జన్‌ధన్ ఖాతాలకు కేంద్ర ప్రభుత్వం బదిలీ చేసిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాదిమంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా సహాయం అందించామని అన్నారు. కోస్తా తీర ప్రాంతాల అభివృద్ధి కోసం బ్లూ ఏకానమీని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందని చెప్పారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందా లనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో నిన్న నిర్వహించిన సంకల్ప్ సప్తహ్ సంవృద్ధి దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా

మంత్రి మాట్లాడుతూ.. సంకల్ప్ సప్తాహ్ సంవృద్ధి కార్యక్రమం కింద రాష్ట్రంలోని 7 జిల్లాల్లో 15 మండలాలు ఎంపికయ్యాయని తెలిపారు. అందులో ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం మండలం ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. త్వరలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా యర్రగొండపాలెంలో మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆదేశాలు జారీ చేశారు. దీని ద్వారా ఉద్యోగులు, పింఛనర్లతో పాటు కుటుంబసభ్యులకూ ప్రయోజనం కలగనుంది. పథకం నిర్వహణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో బోర్డును ఏర్పాటు చేశారు. అధికారులు, ఉద్యోగులు, పింఛనర్లు సభ్యులుగా వ్యవహరిస్తారు. దీనికి సంబంధించి జీవో నంబర్ 186ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. కాగా.. ఉద్యోగులు, పింఛనర్లకు హెల్త్ స్కీమ్ అమలు సంతోషకరమని ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. ప్రత్యేకంగా ట్రస్ట్ ఏర్పాటుపై ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

---------------------------

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుపై నమోదైన కేసుల్లో ఈ రోజు కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశముంది. దిగువ కోర్టు నుంచి దేశ అత్యున్నత న్యాయస్థానం వరకు ఆయన దాఖలు చేసిన పిటిషన్లపై విచారణలు, తీర్పులు వెలువడనున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని సుప్రీంకోర్టులో చంద్రబాబునాయుడు వేసిన క్వాష్ పిటిషన్‌పై ఈ రోజు విచారణ జరగనుంది. ఇదే కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని ఆయన వేసిన పిటిషన్‌పై విజయవాడలోని ఏసీబీ కోర్టు ఈ రోజే నిర్ణయాన్ని వెలువరించనుంది. దీంతో పాటు మరోసారి పోలీసు కస్టడీకి కోరుతూ సీఐడీ వేసిన పిటిషన్‌పై కూడా.. ఏసీబీ కోర్టు నిర్ణయం తీసుకోనుంది. హైకోర్టులోనూ చంద్రబాబు నాయుడుకు సంబంధించిన మూడు బెయిల్ పిటిషన్లపై తీర్పులు వెల్లడికానున్నాయి. రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు, అంగళ్లు, ఫైబర్ నెట్ కేసుల్లో బెయిల్ కోసం ఆయన వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై వాదనలు ముగిశాయి. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి తీర్పులను రిజర్వు చేశారు. ఈ మూడు పిటిషన్లపై ఈరోజు న్యాయమూర్తి నిర్ణయం వెల్లడించనున్నారు.

---------------------------

సూర్యుడిపై పరిశోధనల నిమిత్తం ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ.. ఇస్రో వెల్లడించింది. ఇప్పటికే భూమి గురుత్వాకర్షణ నుంచి బయటపడిన ఈ సోలార్ మిషన్ గమనాన్ని సరిచేసేందుకు తాజాగా కీలక విన్యాసాన్ని నిర్వహించామని నిన్న తెలిపింది. వ్యోమనౌక పనితీరు బాగుందని.. లాగ్రాంజియన్ పాయింట్ ఎల్-1 దిశగా దూసుకెళ్తోందని పేర్కొంది. దానిలోని ఇంజన్లను 16 సెకన్ల పాటు మండించి ఈనెల 6వ తేదీన ట్రాజెక్టరీ కరెక్షన్ మాన్యువర్.. టీసీఎంను నిర్వహించాని ఇస్రో ట్వీట్ చేసింది.

---------------------------

సంతానం లేక ఇబ్బందులు పడుతున్న దంపతుల కోసం తెలంగాణలో తొలిసారిగా ఇన్-విట్రో-ఫెర్టిలైజేషన్..ఐవీఎఫ్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం భవనంలో ఏర్పాటు చేసిన సంతాన సాఫల్య కేంద్రాన్ని హోంమంత్రి మహమూద్ అలీ నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. గాంధీ ఆస్పత్రిలో ఐవీఎఫ్ సెంటర్

ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. పేట్లబూర్జు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రుల్లో కూడా ఐవీఎఫ్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. వీటి ద్వారా ఖరీదైన చికిత్సను ఉచితంగా అందిస్తామని వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల రాష్ట్ర స్థాయి సదస్సును ఈ రోజు విజయవాడలో నిర్వహించనున్నారు. పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు, శాసనమండలి, శాసనసభ సభ్యులు, నియోజకవర్గాల బాధ్యులు, ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లాల అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సమన్వయకర్తలు ఇలా 25 రకాల విభాగాలకు చెందిన 8 వేల 200 మందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారు. రాబోయే ఎన్నికలకు సమాయత్తమవడం, ప్రజల్లోకి వెళ్లడంపై పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి వారికి దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగా 'ఎందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి' అనే పార్టీ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

---------------------------

మన దైనందిన జీవితంలో తపాలా సేవల ఆవశ్యకతను తెలియజేస్తూ ఈరోజు ప్రపంచ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు. స్విట్జర్లాండ్ దేశంలో బెర్న్ పట్టణంలో 1874 అక్టోబర్ 9వ తేదీన యూనివర్సల్ పోస్టల్ యూనియన్ స్థాపనకు గుర్తుగా ప్రతి ఏటా అక్టోబర్ 9వ తేదీన ప్రపంచ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు. అయితే... 1969లో టోక్యోలో జరిగిన సమావేశం తీసుకున్న నిర్ణయం మేరకు ఆ ఏడాది అక్టోబర్ 9న మొదటి తపాలా దినోత్సవాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా తపాలా సేవల ఆవశ్యకతను తెలియజేస్తూ... దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర తపాలా శాఖ పలు కార్యక్రమాలు చేపడుతోంది.

---------------------------

ఐ.సి.సి. ప్రపంచ కప్‌లో భాగంగా చెన్నైలో నిన్న జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 6 వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 199 పరుగులకే అన్ని వికెట్లూ కోల్పోయింది. అనంతరం బరిలోకి దిగిన భారత్... 41.2 ఓవర్లలో 4 వికెట్లకు 201 పరుగులు చేసి... లక్ష్యాన్ని ఛేదించింది. 115 బంతుల్లో 97 పరుగులు చేసిన కే.ఎల్.రాహుల్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. మరో వైపు... హైదరాబాద్‌లో ఈ రోజు జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్-నెదర్లాండ్స్ జట్లు తలపడతాయి.

---------------------------

ఆసియా క్రీడల్లో టెన్నిస్ పురుషుల డబుల్స్‌లో రజత పతకం సాధించిన సాకేత్ మైనేనికి ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రకటించారు. సాకేత్‌కు రాష్ట్రంలో టెన్నిస్ అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించే ఆలోచన ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో సాకేత్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి క్రీడలు మాత్రమే మార్గమని తెలిపారు.

---------------------------

గడిచిన నాలుగున్నరేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో మద్యం విధానంలో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరారు. నిన్న ఢిల్లీలో ఆయనతో సమావేశమైన ఆమె రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో మద్యం కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన విషయాలపై హోంమంత్రికి వినతిపత్రం అందజేశారు.

---------------------------

యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిన్న నిర్వహించిన సిటిజన్ యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. రాజకీయాల్లో కోట్లు లేనిదే ఓట్లు రావనే పరిస్థితి ప్రస్తుతం ఏర్పడిందని.. అది మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సిద్ధాంతాలకు కట్టుబడి చేసే రాజకీయాల వల్ల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. చట్టసభల్లో ఫలవంతమైన చర్చలు జరిగి ప్రజలకు ఉపయోగపడే చట్టాలు రావాలని ఆకాంక్షించారు. యువత రాజకీయాల్లోకి రావటం ద్వారా భవిష్యత్తు తరాలకు మరింత ప్రయోజనం ఉంటుందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వాహక అధికారిగా కె.ఎస్.రామారావు నియమితులయ్యారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయన్ను.. దుర్గ గుడి కార్యనిర్వాహక అధికారిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఆయన బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

=======================